ఆండాళమ్మకు ఒడిబియ్యం

- పట్టువస్త్రాలు సమర్పించిన పద్మశాలీలు

అమ్మవారికి ఒడి బియ్యం తీసుకెళ్తున్న పద్మశాలీ సంఘాల నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 15: సిరిసిల్ల పట్టణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వేలాదిగా తరలివచ్చిన సుహాసినులు ఆండాళమ్మ వారికి ఒడిబియ్యం సమర్పించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయంలో ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఆలయ అర్చకులు, భక్తులు ఉన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

పద్మావతి దేవీ అమ్మవారితోపాటు శ్రీనివాసుడికి పద్మశాలీ కులస్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టణ పద్మశాలీ సంఘం, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆండాళమ్మతో సహ శ్రీవారి దంపతులకు ఒడి బియ్యాన్ని సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పట్టణ పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

'పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం'

సోమారంపేటలో పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం సుధారాణి

ఇల్లంతకుంట, అక్టోబర్ 15 : గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చుని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం సుధారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని సోమారంపేటలో రాజన్న మదర్ యూనిట్ ద్వా రా పెంచిన పెరటి కోళ్లను గ్రామస్తులకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మదర్ యూనిట్ ద్వారా 400 గ్రాముల కోడి పిల్లను రూ.110కు ఇస్తున్నామని పేర్కొన్నారు. అవసరం ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ఎంపీడీవో శశికళ, ఏపీఎం వాణిశ్రీ, సీసీలు రామచంద్రారెడ్డి, వెంకటేశం, రాజేశ్వరి, మండల సమాఖ్య ఏబీ లు, వీవోఏలు, పెరటికోళ్ల పెంపకందారులు కవిత, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తారా..

- రోడ్ల విస్తరణ పట్టణ సభలో నిర్వాసితుల ఆగ్రహం
- విస్తరణ విరమించుకోవాలంటూ ఆర్డీవోకు వినతి

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సభలో ఆర్డీవో రాజేశ్వర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

వేములవాడ, అక్టోబర్ 15: 'అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తారా..' అంటూ వేములవాడ పట్టణ ప్రధాన రహదారి విస్తరణ నిర్వాసితులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పట్టణ సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో కోల్పోతున్న నిర్వాసితులు ప్రధాన రహదారిలో దుకాణాలను మూసివేశారు. సుమారు 150 మంది బైక్ ర్యాలీతో విస్తరణను విరమింప చేసుకోవాలని నినదిస్తూ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ అధ్యక్షతన పట్టణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇందుకు ఇప్పటికే ప్రధాన దినపత్రికల్లో నోటిఫికేషన్ కూడా ఇచ్చామని తెలిపారు. ఇందులో భాగంగానే నిర్వాసితుల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలుంటే స్వీకరిస్తామని ఆయన తెలిపారు. మొత్తం 243 దుకాణాలు, నివాసాలున్నట్లుగా ఇప్పటికే అధికారులు గుర్తించారు. కాగా, వ్యాపారులు మొదటి నుంచే రహదారి విస్తరణ ఆపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కూడా కలిసి కోరారు. అయితే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చెపట్టాల్సిందేనని వ్యాపారులకు ఇప్పటికే ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రధాన రహదారి విస్తరణపై పట్టణ సభను నిర్వహించగా వ్యాపారులు పూర్తిస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి విస్తరణను విరమింప చేసుకోవాలని ఆర్డీవోకు లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కమిషనర్ సంపత్ రెడ్డి, తహసీల్దార్ మహేశ్ కుమార్, టీపీవో అన్సార్, కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామ్ చందర్, రేగుల సంతోష్ బాబు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యుడు బాబున్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి వచ్చాడు కథ మొదలైంది

వేములవాడ ప్రధాన రహదారిని విస్తరించకుండా గతంలోనే రెండు బైపాస్ నిర్మాణాలకు ఆర్థికంగా సహాయం చేశాం. ఇప్పుడు మళ్లీ రెడ్డి వచ్చాడు కథ మొదటి నుంచి చెప్పినట్లుగా ఉంది మా పరిస్థితి. రెండు బైపాస్ రహదారులతో పట్టణంలోకి ఎవరూ రావడం లేదు. వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

-చీకోటి శ్రీహరి, వేములవాడ

అభివృద్ధి పేరుతో విధ్వంసం చేస్తారా..

అభివృద్ధి పేరుతో ఉన్నవి కూలగొట్టి విధ్వంసం చేస్తారా.. 32 ఎకరాలను గుడి చెరువుకు సేకరించారు. ముందు అక్కడ అభివృద్ధి పనులు చేయండి. మిగిలిన పనులన్నింటినీ ముందుగా పూర్తి చేయండి. రాజన్న ఆలయం అభివృద్ధి చేశాక అప్పుడు రోడ్డు విస్తరణ గురించి ఆలోచించండి. తప్పదనుకుంటే తామే స్వచ్ఛందంగా ముందుకు వస్తాం.

-నేరెళ్ల తిరుమల గౌడ్, వేములవాడ

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన నేతలు

మాజీ మంత్రి కేటీఆర్‌తో కోడి అంతయ్య

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 15: దసరా పండగ పురస్కరించుకొని మాజీ మంత్రి కేటీఆర్‌ను తంగళ్లపల్లి మండల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలతో ఆప్యాయంగా మాట్లాడి, ఆలింగనం చేసుకున్నారు. వీరిలో మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, మాజీ ఎంపీటీసీ బుస్సలింగం తదితర నేతలున్నారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

- కార్యనిర్వాహక ఇంజినీర్ విజయ్‌కుమార్

కలెక్టరేట్, అక్టోబర్ 15 : సిరిసిల్లలోని 120 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రంలోని తాగునీటి పంప్ హౌస్‌లో ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ నిమిత్తం నేడు 16న (బుధవారం) ప్లాంట్ నిలిపివేయడం జరుగుతుందని మిషన్ భగీరథ సిరిసిల్ల డివిజన్ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎన్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవరాల్లోని గ్రామాలు, మున్సిపాలిటీలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. 17న గురువారం తిరిగి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. అప్పటివరకు ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ చౌక్/ముస్తాబాద్, అక్టోబర్ 15: జిల్లాలోని ఔత్సాహిక యువకులు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై మూడు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం పెద్ద నగరాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు కలిగిన యువకులు ఎస్సెస్సీ మెమో సర్టిఫికెట్‌తో 18వ తేదీలోగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

హనుమాన్ చాలీసా పారాయణం

వేములవాడ రూరల్, అక్టోబర్ 15: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి మంగళవారం జరిగే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం మొదటి వార్షికోత్సవం పుసర్కరించుకొని మంగళవారం హనుమాన్ ఆలయంలో 21సార్లు పారాయణం పఠించారు. ఇక్కడ మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలున్నారు.

ఎస్సారార్ @26.53 టీఎంసీలు

బోయినపల్లి, అక్టోబర్ 15: బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర జలాశయంలో మంగళవారం 26.53 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పీ నుంచి వరద కాలువ ద్వారా 190 క్యూసెక్కుల జలాలు వస్తుండగా అవుట్ ఫ్లో కూడా 190 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

CHANGE OF NAME
I, CH. ANJALI W/o. CHENNAMANENI RAVINDER, R/o. H.No. 1-5-197/18/5, Ravindranath Tagur Nagar, Jagitial. Telangana. Have Changed My Name as **CHENNAMANENI MADHURI**

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 15: మున్సిపల్ పరిధిలోని 3వ వార్డుకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరికి రూ.17,500, శేఖర్‌గౌడ్‌కు రూ.14 వేలు, కే లక్ష్మయ్యకు రూ.5,500 చెక్కులను అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, వార్డు సభ్యులు, తదితరులున్నారు.

ఏజీపీగా పసుల కృష్ణ

ఎల్లారెడ్డిపేటలో పసుల కృష్ణను అభినందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 15: అల్మాస్‌పూర్‌కు చెందిన న్యాయవాది పసుల కృష్ణ సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పలువురు నాయకులు కృష్ణను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ ఏలూరి రాజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు బుచ్చయ్యగౌడ్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మౌనికకు చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చందుర్తి, అక్టోబర్15 : ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న రామన్నపేట గ్రామానికి చెందిన చెన్నవేని మౌనికకు రూ.29,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుమ్మ అంజయ్య, మేకల పరశురాములు నాయకులు బైరగోని రమేశ్, మరాఠి మల్లిక్, పోతరాజు నాగేశం, సింగిల్ విండో డైరెక్టర్ గుడిసె రమేశ్, తిప్పని అజయ్, లచ్చిరెడ్డి, పోతరాజు తిరుపతి, ఎరెడ్డి రాజిరెడ్డి, తిప్పని రాజయ్య పాల్గొన్నారు.

'నిర్ణీత గడువులోగా బియ్యం అందించాలి'

కలెక్టరేట్, అక్టోబర్ 15: జిల్లాలోని రైస్‌మిల్లర్లు నిర్ణీత గడువులోగా బియ్యం అందించాలని అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన వానకాలం 2023-24, యాసంగి 2023-24 సీజన్లకు చెందిన సీఎంఆర్ బియ్యం సరఫరాకు జిల్లాలోని రా,బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ 2023-25, రబీ సీజన్లకు చెందిన బియ్యం గడువును ఈనెల 31 వరకు పొడిగించామని తెలిపారు. ఆలోగా మిల్లర్లు అందరూ ఎఫ్‌సీఐకి బియ్యం అందించాలని ఆదేశించారు. ఇక్కడ పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మి, ఏడీసీఎస్‌వో నందిని, మేనేజర్ రజిత, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

JYOTHISHMATHI COLLEGE OF EDUCATION
RAMAKRISHNA COLONY, NUSTULAPUR.
Karimnagar-505527 Cell:9177553535
'B' CATEGORY NOTIFICATION FOR B.Ed. COURSE (2024-25)
Applications are Invited from Qualified candidates for Admission Into B.Ed.Course under category 'B' in All Subjects.
Prescribed Application Forms can be had from the College Office and the same may be submitted to the Principal on or before 21.10.2024
Sd/- Secretary & Correspondent

మిషన్ భగీరథ పైపు ధ్వంసం

కోనరావుపేట, అక్టోబర్ 15: మండలంలోని కనగర్తి గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. రాత్రి వేళలో దుండగులు గ్రామానికి సప్లై అవుతున్న మంచినీటి పైపును రంపంతో కోసివేశారు. దీంతో మంచినీరు వృథాగా పోతోంది. పైప్ లైన్ కోసివేసిన దుండగులను పోలీసులు గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు రక్షణ కవచం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఐడీవోసీలో కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ

కలెక్టరేట్: గౌడ కులసుడికి కవచాన్ని అందజేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

కలెక్టరేట్/వేములవాడ రూరల్, అక్టోబర్ 15 : గీత కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ఆడిటోరియం, వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నూతన గ్రంథాలయ భవనంలో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రభుత్వ విప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తున్నదన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 200 మంది ఎంపిక చేసిన లబ్ధిదారులకు రక్షక కిట్లను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపారాణి, అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, బీసీ సంక్షేమ శాఖాధికారి రాజ మనోహర్, అబ్కారీ శాఖాధికారి పంచాక్షరీ, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి

వేములవాడ రూరల్, అక్టోబర్ 15 : పశు సంపదను కాపాడుకాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం లింగంపల్లిలో జాతీయ ఉచిత గాలికుంటువ్యాధి నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పశువుకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పశుసంవర్ధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు.

బాధిత మహిళలను ఇబ్బందులు గురిచేయద్దు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 15: మహిళ గ్రూపల సీఏ కల్యాణి దొరికే వరకు బాధిత మహిళలను ఇబ్బందులకు గురి చేయవద్దుని బ్యాంక్ అధికారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో బాధిత మహిళలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బ్యాంక్ అధికారులు తమను డబ్బులు కట్టమని ఇబ్బందులు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ విప్ బ్యాంక్ అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు.

ఉద్యోగం రాలేదని..

- మానేరులో దూకి వివాహిత ఆత్మహత్య

వేములవాడ రూరల్, అక్టోబర్ 15 : ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఓ వివాహిత ప్రాణం తీసుకున్నది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన నక్క దివ్య (33) ఇటీవల డీఎస్సీ పరీక్ష రాసింది. అయితే.. ఉద్యోగం రాకపోవడం, గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకోగా అవి విడాకులకు దారి తీయడం.. వీటిని దృష్టిలో పెట్టుకొని ఉదయం ఇంటి నుంచి వచ్చి ఆరెపల్లి గ్రామ శివారు మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మృతదేహం తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, అక్టోబర్ 15 : రహీంఖాన్‌పేట గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో హిందీ అధ్యాపక పోస్టుకు ఖాళీగా ఉన్నందున దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని, 18న ఉదయం 10 గంటలకు ఆదర్శ పాఠశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. హిందీ పండిట్ పూర్తిచేసి టెట్ అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు.

హోటళ్లో చోరీ

ముస్తాబాద్ అక్టోబర్ 15 : మండల కేంద్రం నుంచి నామాపూర్ గూడెం ప్రధాన క్రాసింగ్ వద్ద చిన్న హోటల్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి తినుబండారాలతోపాటు నగదు, మద్యం సీ సాలు ఎత్తుకెళ్లినట్టు హోటల్ యజమాని లచ్చన్న గారి లింగం తెలిపాడు. షాపులోని రూ.1800 నగదుతోపాటు మద్యం బాటిల్ ఎత్తుకెళ్లినట్లు, విషయాన్ని పోలీసులకు తెలిపినట్లు పేర్కొన్నాడు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

తెలంగాణ చౌక్, అక్టోబర్ 15: సిరిసిల్ల పట్టణంలోని రెండవ బైపాస్‌కు ఆనుకొని ఉన్న గ్రామాల రైతులు రోడ్డపై వడ్లు పోస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరకుండా బోర్డు లు ఏర్పాటు చేయాలని టౌన్ సీఐ కృష్ణ సూ చించారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి, మాట్లాడారు. ప్ర తి సీజన్‌లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీ లు, రేడియంలను ఏర్పాటు చేసి వాహనదారులకు రాత్రి పూట కనిపించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. రోడ్డుకు ఒక్కసైడ్ మాత్రమే వడ్లు పోసుకోవాలన్నారు. ఎలాం టి హెచ్చరిక బోర్డులు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హె చ్చరించారు. ఇక్కడ కౌన్సిలర్లు రాజిరెడ్డి,సత్య నారాయణ, నాగరాజు తదితరులున్నారు.

ముగిసిన మిత్రుల అంత్యక్రియలు

వేములవాడ రూరల్, అక్టోబర్ 15 : వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన సూర అనిల్, వికృతి దిలీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. గల్ఫ్ నుంచి వచ్చిన తండ్రుల రోదన లు మిన్నంటాయి. దీంతో రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది.

కథల పోటీల్లో ఆవునూరు విద్యార్థినుల ప్రతిభ

తోట పూజ

జక్కుల శ్రావణి

ముస్తాబాద్, అక్టోబర్ 15 : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూరు ఉన్నత పాఠశాలకు చెందిన తోట పూజ, (పదవ తరగతి) రాసిన 'మా ఊరి అందాలు కథ' జక్కుల శ్రావణి, (8వ తరగతి) రాసిన 'స్నేహానికి ప్రతిరూపం' కథ ప్రత్యేక బహుమతికి ఎంపికయ్యాయని ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. ఈ కథల పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 232 కథలు రాగా, అందులో 28 మంది విద్యార్థులు రాసిన కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేసినట్లు మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వాహకులు మాచిరాజు కామేశ్వరరావు తెలిపారన్నారు. పూజ, శ్రావణికి నవంబర్ 3న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సన్మానంతోపాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతోపాటు బాల సాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.

అన్నదాతలకు అండగా నిలుద్దాం

గంభీరావుపేట, అక్టోబర్ 15: అన్నదాతల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుద్దామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏ ర్పాటు చేశారు. మల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు రెండు కాంటాలతోపాటు టార్పాలిన్లను చైర్‌పర్సన్ అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్, డైరెక్టర్లు తదితరులుపాల్గొన్నారు.

అర్చకులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముస్తాబాద్, అక్టోబర్ 15: ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న అర్చకుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, ప్రస్తుతం ఇస్తున్న ధూపదీప నైవేద్యాల అర్చకుల వేతనాలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని జిల్లా ధూపదీప నైవేద్యాల అర్చకులు కోరారు. మండలంలోని గూడూరు సాయిబాబా ఆలయ ఆవరణలో మంగళవారం జిల్లా ధూపదీప నైవేద్యాల అర్చకుల సమావేశం మండలాధ్యక్షుడు మధురాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్వతి పార్థసారథి శర్మ, గౌరవాధ్యక్షుడు కొండమాచార్యులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి

వేములవాడ/వీర్నపల్లి/చందుర్తి, అక్టోబర్15: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని చదవాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

132 మంది నూతన టీచర్లకు పోస్టింగ్స్

నూతన టీచర్ల పోస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, అక్టోబర్ 15 : జిల్లాలోని డీఎస్సీ పరీక్ష ద్వారా ఎంపికైన 132 మంది నూతన టీచర్లకు జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆప్షన్స్ ద్వారా పోస్టింగ్స్ కేటాయించినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నూతన టీచర్లకు పోస్టింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించగా, పరిశీలించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్ష ద్వారా నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, వ్యాయామ ఉపాధ్యాయులకు రాష్ట్ర ముఖ్యమంత్రి అక్టోబర్ 9న నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఎంపికైన 132 మంది నూతన టీచర్లు అక్టోబర్ 16న కేటాయించబడిన పాఠశాలలో జాయిన్ కావాల్సిందిగా కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, సంబంధిత అధికారులు, నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందు బాబుల అడ్డాగా వెంకట్రావుపేట బడి

- పాఠశాల ఆవరణలోనే మద్యం సీసాలు, తినిపడేసిన ప్లేట్లు
- తరగతి గదుల తలుపులు ధ్వంసం



వెంకట్రావుపేటలో ధ్వంసం చేసిన పాఠశాల తలుపు

పాఠశాల ఆవరణలో మద్యం తాగిన తర్వాత ఖాళీ సీసాలు, తినిపడేసిన విస్తార్లు

కోనరావుపేట, అక్టోబర్ 15: వెంకట్రావుపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాలకు దసరా సెలవులు రావడంతో ఉపాధ్యాయులు బడికి తాళం వేసి ఉంచారు. ఈక్రమంలో పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగారు. ఖాళీ బీరు సీసాలు, మాంసం ముక్కలు, తినిపడేసిన ప్లేట్లు ఆవరణలో చిందరవందరగా పడివేశారు. పాఠశాలకు వేసి ఉంచిన తాళాలు పగలగొట్టి తరగతి గదులు, తలుపులను ధ్వంసం చేశారు. మంగళవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో ఉదయం వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఖాళీ సీసాలు, ప్లేట్లు దర్శనమిచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో పోలీసులు దృష్టిసారించి రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించి మందు బాబులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇది ఒక్క పాఠశాలనే కాకుండా కనగర్తి ప్రభుత్వ పాఠశాలతోపాటు పలు పాఠశాలల్లో మందుబాబులు మద్యం తాగుతున్నారు. ఇప్పటికైనా ఇవి పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.